
# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 44 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 05, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

◆ ముగ్గురు హైదరాబాదీల దుర్మరణం



హైదరాబాద్,(నమస్తే ఉదయం): అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు హైదరాబాద్ వాసులు మరణించారు. టెక్సాస్ రాష్ట్రంలోని అన్నాలోని రోడ్డు నంబర్ 75లో శుక్రవారం వరుసగా 5 వాహనాలు ఒకదానికొకటి అతి వేగంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు భారతీయులు దుర్మరణం చెందారు. మృతులను హైదరాబాద్‌కు చెందిన ఓరంపాటి ఆర్యన్ రఘునాథ్, ఫారూక్ షేక్, పాలచర్ల లోకేశ్, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌గా గుర్తించామని అక్కడి అధికారులు వెల్లడించారు. కాల్‌పూలింగ్ ద్వారా ఈ నలుగురు బెన్‌టోన్‌విలలె ప్రాంతానికి వెళ్లేందుకు ఒకే వాహనంలో ఎక్కారని తెలిపారు. వీరు ప్రయాణిస్తున్న వాహనానికి మంటలు అంటుకోవడంతో బయటకు రాలేకపోయినట్లు తెలుస్తోంది.

## పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డి పల్లె

**తెలంగాణ ఒక బిజినెస్ హబ్ - విద్యుత్ శాఖపై సమీక్షలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్4(నమస్తే ఉదయం): రాబోయే రోజుల్లో తెలంగాణ ఒక బిజినెస్ హబ్ గా మారబోతోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అందుబాటులో ఉండేలా చూడాలి. ఐటీ, ఇండస్ట్రియల్ శాఖలతో సమన్వయం చేసుకుని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సోలార్ విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలి.

డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టండి. వివిధ శాఖల్లో వినియోగంలో లేని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోండి. రైతులకు సోలార్ పంప్ సెట్ లను ఉచితంగా అందించి వారిని సోలార్ విద్యుత్ వైపు ప్రోత్సహించాలి. కొండారెడ్డి పల్లెను పైలెట్ మిగతా.. 2లో

## పొంచివున్న మరో అల్పపీడనం

◆ వరదల నుంచి కొంత ఉపశమనం

◆ తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): ప్రస్తుతానికి తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తెరిపినిచ్చాయి. దీంతో కాస్త ఉపశమనం కలిగినా.. మళ్లీ మరో అల్పపీడన గండం పొంచి ఉందని వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. మరి రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు జిల్లాలకు హెచ్చరికలు పంపింది. గురువారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం వల్ల ఏపీలో బుధవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలో ఓ గంటపాటూ భారీ వర్షాలు కురుస్తాయి. ఆ తర్వాత కూడా మోస్తరుగా కురుస్తాయి. ఇవాళ రాయలసీమలో మాత్రం వర్షాలు లేవు. అరేబియా సముద్రంలో గాలి వేగం గంటకు 30 కిలోమీటర్లుగా ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం గంటకు 15 నుంచి 25 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. మిగతా.. 2లో




## హైడ్రాకు హైపవర్..

◆ హైకోర్టు నియమించిన కమిటీ తన నివేదికలో గోపన్‌పల్లిలోని గోసానికుంట

◆ చెరువు గురించి పేర్కొన్న అంశాలు..

◆ ఆక్రమణల తొలగింపునకు సర్వాధికారాలు

◆ నోటీసులు కూడా జారీ చేసేలా..

◆ రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, పంచాయతీరాజ్‌కు పురపాలక శాఖ లేఖ

◆ చట్టంలో మార్పులా?.. అధికారాల బదలాయింపా?

◆ న్యాయ సలహా కోరిన రెవెన్యూ అధికారులు

◆ హెచ్‌ఎండీఏలోని 3532 చెరువులు హైడ్రా కిందికే!

హైదరాబాద్, సెప్టెంబరు 4(నమస్తే ఉదయం): చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాకు మరిన్ని అధికారాలను కట్టబెట్టే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. అక్రమ కట్టడాల తొలగింపునకు ఇప్పటివరకు వివిధ శాఖల పరిధిలో ఉన్న అధికారాలన్నింటినీ హైడ్రా పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖ.. ఇలా సంబంధిత శాఖలన్నింటి నుంచి హైడ్రా విధి నిర్వహణకు అవసరమైన అధికారాలను ఆ సంస్థకు బదలాయించనున్నారు. ఉదాహరణకు.. ఇటీవల దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భవనాల తొల గింపునకు సంబంధించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు.

అయితే ఇక నుంచి నోటీసులిచ్చే అధికారాన్ని కూడా రెవెన్యూ నుంచి హైడ్రాకు బదలాయించనున్నారు. కాగా, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండే అధికారాలనూ హైడ్రాకు బదలాయించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఆ శాఖలను కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైడ్రాకు అధికారాలను కట్టబెట్టే విషయంపై ఇటీవల సీఎస్ శాంతికుమారి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపు విషయంలో, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించే విషయంపై ఆగస్టు 29న ఈ సమీక్ష జరిగింది.

ఈ సందర్భంగా.. ఆక్రమణల తొలగింపుపై నీటిపారుదల, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ప్రస్తుతం వేర్వేరుగా నోటీసులు ఇస్తున్నాయని సీఎస్ తెలిపారు. ఇక నుంచి ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న ఆస్తుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేతల తొలగింపునకు హైడ్రా ద్వారానే మిగతా.. 2లో

## హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే కఠినచర్యలు

◆ వసూళ్లకు పాల్పడితే నేరుగా జైలుకే పంపిస్తాం

◆ హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్రంగా హెచ్చరిక

◆ అమీన్‌పూర్‌లో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): హైడ్రా పేరుతో బెదిరింపులు, వసూళ్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సామాజిక కార్యకర్తల ముసుగులో బిల్డర్లను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హైడ్రాలో ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నట్లు బెదిరిస్తున్నారని చెప్పారు. తమ విభాగాన్ని నీరుగార్చే ప్రయత్నాలు, తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో డబ్బు కావాలని ఒత్తిడి చేస్తే స్థానిక పోలీస్‌స్టేషన్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో డబ్బు వసూళ్లకు పాల్పడిన విప్లవ్‌ను పోలీసులు మిగతా.. 2లో



## సింగపూర్ చేరుకున్న ప్రధాని మోడీ

◆ రెండ్రోజులపాటు పర్యటించనున్న ప్రధాని



న్యూఢిల్లీ,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): భారతదేశం ఎల్లవేళలా సముచిత, ఆదర్శనీయ పెట్టుబడుల విడిది అవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. మిత్రదేశం సింగపూర్‌లో రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోడీ బుధవారం ఇక్కడికి వచ్చారు. ఇండియా సింగపూర్ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్నేహం మరింత ఇనుమడింప చేసుకునేందుకు మోడీ ఈ పర్యటన తలపెట్టారు. భౌగోళికంగా అత్యంత కీలకమైన ఈ ఆగ్నేయాసియా దేశం నుంచి భారత్‌కు భారీ పెట్టుబడులను రాబట్టుకునేందుకు ప్రధాని యత్నిస్తారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకు సింగపూర్‌లో పర్యటించే ప్రధాని మోడీ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. సింగపూర్‌లోని మూడు తరాల నాయకత్వ శ్రేణులతో ముచ్చటిస్తారని భారత అధికార వర్గాలు తెలిపాయి. సింగపూర్‌కు తన ఆగమనాన్ని ప్రధాని మోడీ సామాజిక మాధ్యమాల్లో ఫోటోతో పాటు పొందుపర్చారు. సింగపూర్‌కు మోడీ వెళ్లడం ఇది ఐదోసారి. భారతదేశంలో సంస్కరణలు, ప్రత్యేకించి యువశక్తి ప్రతిభాపాటవాలు , అపార మానవ వనరులు వంటివి భారత్‌ను సర్వదా పెట్టుబడుల కేంద్రం చేస్తున్నాయని మోడీ తెలియచేసుకున్నారు. ఇరు దేశాల మధ్య విస్తృత సాంస్కృతిక సంబంధాలను ఆశిస్తున్నట్లు వివరించారు. మిగతా.. 2లో

## వయనాడ్‌కు రాహుల్ నెల జీతం విరాళం

**కేరళ కాంగ్రెస్‌కు అందనున్న సాయం**

న్యూఢిల్లీన్యూఢిల్లీ,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు. కేరళలో ఇటీవల విలయం సృష్టించిన వయనాడ్ కొండచరియల బాధితులకు ఒక నెల జీతాన్ని విరాళంగా ప్రకటించారు. వయనాడ్‌లో పునరావాసం కోసం కార్యక్రమాలు చేపడుతున్న కేరళ ప్రదేశ్ మిగతా.. 2లో

## కాంగ్రెస్‌లోకి రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా

◆ రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

◆ హర్యానా ఎన్నికల్లో పోటీకి రాహుల్ ఆఫర్




న్యూఢిల్లీ,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): రెజ్లర్లు వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బుధవారం మధ్యా హ్నం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కలిశారు. హర్యానా ఎన్నికల సమయంలో వినేష్, మిగతా.. 2లో



## వరదలతో రైతులకు తీరని నష్టం

◆ వరద నష్టాన్ని అంచనా వేస్తున్నాం

◆ బాధితులను అందరినీ ఆదుకుంటున్నాం

◆ పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొంగులేటి


ఖమ్మం,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): వరద నష్టాన్ని అంచనా వేస్తున్నామని, రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అందరినీ ఆదుకునే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లోని మిగతా.. 2లో

## వరద బాధితులకు బిఆర్ఎస్ సాయం

◆ ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యలే ఒకనెల వేతనం విరాళం

◆ పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశాలతో నిర్ణయం

◆ సిద్దిపేటలో వెల్లడించిన హరీష్ రావు



సిద్దిపేట,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో వరద బీభత్సం అంతాఇంతా కాదు. భారీ వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యవసర వస్తువుల కోసం అల్లాడిపోతున్న పరిస్థితి. ఈ క్రమంలో వరద బాధితులకు విరాళాలు ఇచ్చేందుకు అనేక మంది ముందుకు వస్తున్నారు. తాజాగా బీఆర్ఎస్ నేతలు కూడా వరద బాధితుల కోసం భారీ విరాళాన్ని అందజేయనున్నట్లు మాజీ మంత్రి హరీష్‌రావు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఒక నెల జీతం విరాళంగా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. ఖమ్మం వరదల కారణంగా చాలా నష్టపోయారన్నారు. సిద్దిపేట కౌన్సిలర్‌లు కూడా ఒక నెల జీతం ఇవ్వాలని నిర్ణయించారని మాజీ మంత్రి ప్రకటించారు. మానవ సేవయే మాధవ సేవ.. ఆపదలో ఉన్న వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టే అని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో వరదలు వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. అన్ని రకాల వస్తువులు మిగతా.. 2లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు షాక్

◆ పెన్షన్లు భత్యాలు నిలుపు చేస్తూ బిల్లు

◆ ఆమోదించిన హిమాచల్ అసెంబ్లీ

సిమ్లా,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ఇకపై పెన్షన్ నిలిపివేయనున్నారు. దీనికి సంబంధించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించారు.




హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మేరకు కొత్త బిల్లు ప్రవేశపెట్టింది.ఎమ్మెల్యేల ఫిరాయింపులను అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టింది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ (సభ్యుల భత్యాలు, పెన్షన్) సవరణ బిల్లు 2024ను సీఎం మిగతా.. 2లో

## మేడారం అడవుల్లో టోర్నడోల బీభత్సం

◆ 50 వేలకు పైగా చెట్లు నేలమట్టం



ములుగు,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలులు బీభత్సం సృష్టించడంతో మహావృక్షాలు కిందకూలాయి. ఒకే చోట మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. ఈ నెల 1వ తేదీన పరిశీలనకు వెళ్లిన అధికారులు సుడిగాలి బీభత్సానికి చెట్లు కూలడం చూసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. టోర్నడోల కారణంగానే ఈ చెట్లు కూలి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వృక్షాలు కూడా నేలకు ఒరగడాన్ని బట్టి కనీసం గంటలకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వచ్చి ఉంటాయని తెలిపారు. అయితే 50 వేలకు పైగా చెట్లు కూలిపోవడంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# జనరల్ న్యూస్ GENERAL NEWS

గురువారం ● 05, సెప్టెంబర్ 2024

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




## పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డి పల్లె

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుగా తీసుకోవాలని అధికారులకు ఆదేశం.

సోలార్ పంప్ సెట్ ల ద్వారా వచ్చే మిగులు విద్యుత్ పై రైతుకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. వంటగ్యాస్ బదులుగా సోలార్ సిలిండర్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టండి. వీటిపై మహిళా సంఘాలకు శిక్షణ అందించి వారిని సోలార్ సిలిండర్ బిజినెస్ వైపు ప్రోత్సహించాలి. అటవీ భూముల్లోనూ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి.

ప్రతి ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టండి. ప్రణాళికాబద్దంగా వ్యవహరించి దుబారాను తగ్గించాలి. ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టండి. ఒక్క నిమిషం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండొద్దు. వినియోగదారులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న నమ్మకం కలిగించాలి. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగనీయొద్దు.

## సోషల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న 6,200 మంది తొలగింపు

### ఇది దుర్మార్గపు చర్య అంటూ హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): సోషల్ వెల్ఫేర్ విద్యాలయాల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లు, డీఈవోలను ఏకకాలంలో విధుల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దీన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

మూడు నెలలుగా జీతాలు చెల్లించరు. ఇదేంటని అడిగినందుకు ఉద్యోగాల నుండి తొలగిస్తారు.. ఇదేనా మీ ప్రజా పాలన? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇదేనా మీరు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం? అని నిలదీశారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లను తొలగించి వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల బతుకులను ఆగం చేశారని మండిపడ్డారు. మరోవైపు మీ నిర్లక్ష్య, అర్థం లేని నిర్ణయం వల్ల వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లు, డీఈవోలను వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సిలిండర్ల లారీ

### తప్పిన పెను ప్రమాదం

వరంగల్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ సంఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఖానాపురం మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలను ఢీకొని బోల్తా పడింది. అదృష్టవశాత్తు కరెంట్ తగలక పోవడంతో సిలిండర్లు పేలకుండా పోయాయి. లేకుంటే భారీ అగ్ని ప్రమాదం సంభవించేది. ఈ ప్రమాదంలో రెండు విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. వరంగల్ నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన డ్రైవర్‌ను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా తీసుకు వస్తాం

### ఎన్నికల ప్రచారంలో రాహుల్ హామీ

శ్రీనగర్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జమ్మూ కాశ్మీర్‌లో తమ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. ఇండియా కూటమి సాయంతో తమ పార్టీ కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ జరిగేలా చూస్తుందని రాహుల్ హామీ ఇచ్చారు. 'అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ముందే జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ఆశించాం. కానీ బిజెపి సుముఖంగా లేదు. ఎన్నికలు ముందు నిర్వహించాలని బిజెపి కోరింది' అని ఆయన చెప్పారు. 'బిజెపి కోరుకున్నా, కోరుకోకపోయినా ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదా తిరిగి వచ్చేలా చూస్తాం.రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరిగేలా ఇండియా కూటమి పతాకం కింద ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం' అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ స్పష్టం చేశారు. రామ్‌బన్ జిల్లా బనీహాలల అసెంబ్లీ నియోజకవర్గంలోని సంగల్దాన్‌లో ఒక ఎన్నికల ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ఈ నెల 18న తొలి విడతగా మరి 25 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు బనీహాల్‌లో పోలింగ్ జరుగుతుంది. కాంగ్రెస్ తరఫున వికార్ రసూల్ వనీ పోటీ చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొండ రాళ్ల తొలగింపు

### వివిధ శాఖలకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): జూబ్లీహిల్స్ ప్రాంతంలో కొండ రాళ్ల తొలగింపునకు పేలుళ్లు జరపడంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా ప్రతివాదులకు సీజే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. కొండ రాళ్ల తొలగింపునకు రాత్రి వేళల్లో పేలుళ్లు జరుపుతున్నారని మీడియాలో ఇటీవల కథనం వచ్చింది. దీని ఆధారంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ లేఖ రాశారు. రాత్రి వేళల్లో భారీ పేలుళ్లు జరుపుతున్నారని అందులో పేర్కొన్నారు.

దీనివల్ల న్యాయవిహార్, భరణి లేఅవుట్, రామానాయుడు స్టూడియో ప్రాంతాల్లో నివాసముండే వాళ్లకు నిద్ర ఉండటం లేదని చెప్పారు. పేలుళ్ల తర్వాత బండరాళ్లను రాత్రి వేళల్లో భారీ వాహనాల్లో తరలిస్తున్నారని జస్టిస్ భీమపాక నగేశ్ వివరించారు. దీంతో ఆ లేఖను సీజే ధర్మాసనం ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారణ చేపట్టింది. భూగర్భ గనులు, పర్యావరణ శాఖ, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు, కాలుష్య నియంత్రణ మండలి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.

## సింగపూర్ చేరుకున్న ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

బ్రూనేలో తమ అధికారిక పర్యటనను ముగించుకుని, అక్కడి నుంచి మోడీ సింగపూర్‌లో వాలారు. లయన్ సిటీ సింగపూర్‌కు చేరిన ప్రధానికి అక్కడి హోం , న్యాయ వ్యవహారాల మంత్రి కె షణ్ముగం సాదర స్వాగతం పలికారు. ఇక్కడ ప్రధాని మోడీ ఉత్తేజభరిత కార్యాచరణ స్థాయి చర్చల అజెండా ఖరారు అయిందని ప్రధాన మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక ప్రధాని మోడీకి గురువారం పార్లమెంట్ ఆవరణలో అధికారిక స్వాగతం పలుకుతారు. తరువాత ఆయన దేశాధ్యక్షులు థర్మన్ శణ్ముగరత్నంను కలుసుకుంటారు. వీరి మధ్య చర్చలు జరుగుతాయి. గతంలో ప్రధాని మోడీ 2018లో సింగపూర్‌కు వెళ్లారు. ఇప్పుడు ప్రధాని వెంట విదేశాంగ మంత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

సింగపూర్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు లూంగ్, గో ఛోక్ టాంగ్‌ను కూడా ప్రధాని కలుస్తారు. మోడీ పర్యటన దశలో సెమీకండక్టరు రంగంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఎంఒయులపై సంతకాలు జరుగుతాయని విదేశాంగ శాఖ తెలిపింది. సింగపూర్‌కు చెందిన సంస్థల ద్వారా భారతీయ యువతకు సరైన నైపుణ్యం కల్పించడం, వారికి రిక్రూట్‌మెంట్లు ఉండటం వల్ల ఇకపై భారతీయ యువతరానికి సింగపూర్ ప్రధాన అవకాశాల వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం అయింది.

## హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే కఠినచర్యలు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేసినట్లు చెప్పారు. సోషల్ వర్కర్ ముసుగులో హైడ్రా పేరు చెప్పి రూ. 20 లక్షలు ఇవ్వాలని బిల్డర్లను డిమాండ్ చేసిన వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సాయివిల్లాస్ రోడ్డులో ఎంసీఆర్ఓ ప్రాజెక్ట్ పేరుతో జూబ్లీహిల్స్‌కు చెందిన బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజు నాథ్‌రెడ్డి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అన్ని రకాల అనుమతులు ఉన్నప్పటికీ, అపార్ట్‌మెంట్ పెద్దచెరువు నాలా బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందని, అదే కాలనీలో అద్దెకు ఉండే ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బండ్ల విప్లవ్‌సిన్హా కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్లాట్లు చూసేందుకు వచ్చే కస్టమర్లకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడు. సామాజిక కార్యకర్తగా చెప్పుకునే ఆయన పలు ప్రభుత్వ శాఖలకు పదేపదే ఫిర్యాదులు చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడం ప్రారంభించాడు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలుమార్లు అమీన్‌పూర్‌లో పర్యటించిన సందర్భంలో ఠంచన్‌గా ప్రత్యక్షమై ఆయనతో ఫొటోలు తీయించుకున్నాడు. గత నెలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చిన మరుసటి రోజు బిల్డర్లు రాజేంద్రనాథ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలను అశోక్‌నగర్ పిస్తాహౌజ్ వద్దకు పిలిపించి, తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చాలా దగ్గర అని ఫొటోలు చూపించి బెదిరించాడు. అపార్ట్‌మెంట్ కూల్చకుండా ఉండాలంటే తనకు రూ.20 లక్షలు ముట్టచెప్పాలని లేదంటే, పత్రికల్లో వార్తలు రాయించి కూల్చివేయిస్తానన్నాడు.

మరోమారు గచ్చిబౌలి ఆఫ్రికన్ కాఫీ హౌజ్ వద్దకు పిలిపించి తక్షణం ఎంతోకొంత డబ్బు ఇవ్వాలని, లేదంటే కూల్చడం ఖాయమని తీవ్రంగా బెదిరించాడు. హైడ్రా కమిషనర్‌తో పాటు గతంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహాతో దిగిన ఫొటోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడంతో బిల్డర్లు కంగుతిన్నారు. ఇతడి వేధింపులు భరించలేక బాధితులు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్ఐ టి.విజయరావు తెలిపారు.

## పొంచివున్న మరో అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో బుధవారం పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్నిచోట్ల కురుస్తాయని తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పది మండలాల్లో 6-10 సెంటీమీటర్ల మధ్య, 103 మండలాల్లో 1.5?6 సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది. సెప్టెంబరు 3 నాటికి 148 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 293 మండలాల్లో అధిక వర్షపాతం రికార్డు అయినట్లు వెల్లడించింది. 170 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఒక్క మండలంలో ఇప్పటికి లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. మెదక్ జిల్లా శంకరంపేటలో అత్యధికంగా 8.8 సెంటీమీటర్ల వర్షపాతం, అదే జిల్లా కుల్చారంలో 8.7, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 8.6, మెదక్ జిల్లా టేక్మల్‌లో 8.1, పాపన్నపేటలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు పేర్కొంది. మరోవైపు సెప్టెంబరు నెలవారీ వర్షపాత అంచనాను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. నెలలో రాష్ట్రంలోని పశ్చిమ, తూర్పు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా, మిగతా జిల్లాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ ఉదయం నుంచే హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తుండగా.. మరికొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం పడుతోంది. ఆఫీసు వేళలు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ అంతటా వర్షాలు తేలికపాటి నుంచి మోస్తరుగా కురుస్తాయి. ఉత్తర తెలంగాణలో కొన్ని చోట్ల మాత్రం భారీగా వర్షాలు కురిసే అవకాశముంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, సిద్దిపేట, హనుమకొండ, యాదాద్రి జిల్లాలకు భారీ వర్ష సూచన చేసిన అధికారులు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆర్లెడీ మంగళవారం రాత్రి నుంచి తెలంగాణలో వాన పడుతోంది. ఇక హైదరాబాద్‌లోనూ ఇవాళ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం చెప్పింది.

## వయనాడ్‌కు రాహుల్ నెల జీతం విరాళం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ కమిటీకి (కేపీసీసీ) ఈ సాయాన్ని ఆయన అందజేయనున్నారు. వయనాడ్ కొండచరియల బాధితుల కోసం చేస్తున్న ప్రయత్నాలకు తనవంతు మద్దతుగా ఈ సాయం చేస్తున్నట్టు ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఒక నెల జీతం రూ. 2.3 లక్షల మొత్తాన్ని అందిస్తున్నట్టు వెల్లడించారు. కాగా జులై 30న వయనాడ్‌లో పెను ప్రకృతి విపత్తు జరిగిన విషయం తెలిసిందే. ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాడు. వందలాది మంది చనిపోయారు. వందలాది ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఈ బాధితుల్లో 100 మంది ఇళ్లు కట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ సాయం చేస్తుందని రాహుల్ గాంధీ ఇటీవలే వాగ్దానం చేశారు. ఈ హామీలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ విరాళాలు సమీకరిస్తోందని, రాహుల్ గాంధీ ఇచ్చిన సాయం కూడా ఈ సహాయ నిధులోకి చేరుతుందని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం లిజూ తెలిపారు. కాగా నిధుల సేకరణలో భాగంగా 'స్టాండ్ విత్ వయనాడ్-ఐఎన్‌సీ' అనే మొబైల్ యాప్‌ను రూపొందించామని లిజూ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇక వయనాడ్‌లో పునరావాస పనులకు సంబంధించిన పురోగతిని కాంగ్రెస్ ఎంపీకే సుధాకరన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విరాళాలను అందజేసే కాంగ్రెస్ పార్టీ విభాగాలు, అనుబంధ సంస్థలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గుర్తిస్తామని ఆయన చెప్పారు. మొబైల్ యాప్ ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారులు, నాయకులు నేరుగా విరాళాలను ట్రాన్స్‌ఫర్ చేయవచ్చునని పేర్కొన్నారు. విరాళం అందిన వెంటనే ఎస్ఎంఎస్ ద్వారా దాతకు మెసేజ్ వెళ్తుందని, కేపీసీసీ అధ్యక్షుడు కే సుధాకరన్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ సంతకాలతో డిజిటల్ రసీదు వస్తుందని క్లారిటీగా చెప్పారు.

ఇటీవల కేరళలోని వాయనాడ్ జిల్లా భారీ వర్షాలకు అతలాకుతలం అయ్యింది. మెరుపు వరదలు కొండచరియలు విరిగిపడడానికి కారణమయ్యాయి. ఈ పెను విపత్తులో కొన్ని ఊళు కొట్టుకుపోయాయి. 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది ఇళ్లను కోల్పోయారు. జీవనోపాధికి దూరమయ్యారు. రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ అన్నీ దెబ్బతిన్నాయి.

## వరద బాధితులకు బిఆర్ఎస్ సాయం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. సిద్దిపేట నుంచి సేవలు అందించేందుకు చాలా మంది ముందుకు వచ్చారని తెలిపారు. సిద్దిపేట నుంచి రేపు 6 లారీల్లో సామాన్లు పంపిస్తున్నామని తెలిపారు. సహాయం చేయడంలో ఇంకా ముందుకు రావాలని హరీష్ రావు పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన మట్టి వినాయకుల పంపిణి కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమర్ నాథ్ సేవా సమితి సేవలు దేశ వ్యాప్తంగా వెళ్లాయని... వారిని మనస్పూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. 13 సంవత్సరాలుగా మంచు కొండల్లో సేవలు అందిస్తున్నార న్నారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు నిలయం సిద్దిపేట అని అన్నారు. ఇప్పుడు ప్రకృతి కోసం మట్టి వినాయకులు పంచు తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలని అన్నారు. సకల కార్యాలకు విగ్నేశ్వరున్ని మొదటగా పూజిస్తామని.. ఆకర్షణ కన్నా ఆధ్యాత్మిక ముఖ్యమన్నారు. మట్టి గణపతే మహా గణపతి అని తెలిపారు. ప్రకృతి ప్రేమిద్దాం.. మట్టి వినాయకులను పూజిద్దాం అని హరీష్ రావు వెల్లడించారు.

## వరదలతో రైతులకు తీరని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

వరద ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు మహబూబాద్, ములుగు, నలగొండ జిల్లాల్లో భారీ నష్టం జరిగిందన్నారు. వాగులు, వంకలు పొరడం వల్ల రైతులకు అధిక నష్టం వాటిల్లిందని పొంగులేటి అన్నారు. అకస్మాత్తుగా వరదలు పెరిగిపోవడంతో ఇల్లు వదిలేసి కట్టుబట్టలతో ప్రజలు రోడెక్కారన్నారు. ఇన్ని సంవత్సరాల్లో ఎప్పుడూ లేని విధంగా ఇంత ఉధృతంగా వర్షం వరదలు రాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, విజయవాడ వరద ఖమ్మం జిల్లా నుంచి వెళుతుందని పొంగులేటి అన్నారు. వరదంతా పంట పొలాల్లో చేరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతుల బాధ, ఆవేదన వర్ణాతీతమన్నారు. ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఇళ్లకు వెళ్లి మరీ నష్టం ఎంత మేర జరిగిందో ప్రత్యక్షంగా చూసి చలించిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు అండగా నిలవాలని ఆ దిశగా ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు. దీనిని జాతీయ విపత్తుగా కేంద్రం స్వీకరించి నష్టాన్ని అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రూ.5438 కోట్లు అన్ని విధాలా నష్టం జరిగినట్లు కేంద్రానికి లేఖ ద్వారా తెలియజేశారని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి నష్టాన్ని అందజేస్తుందని కోరుతున్నామని పొంగులేటి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టానికి ఎలా చేయాలనుకుంటుందో కేంద్రప్రభుత్వం తెలంగాణలో జరిగిన విపత్తు కూడా అలానే సహాయం అందించాలన్నారు. ఈ రాష్ట్రంలో నష్టం జరిగిన రైతులు, ప్రజలకి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అత్యవసరంగా కొంత సహాయంతో పాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆదుకుంటుందని పొంగులేటి తెలిపారు. ఈ వర్షానికి తడిసిన ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు తీసుకొని ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రైతులతో పాటు సామాన్య ప్రజానీకానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని.. అవసరమైన సహాయాన్ని అందజేస్తుందని.. కాబట్టి ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని పొంగులేటి తెలిపారు.

## హైడ్రాకు హై పవర్..

(మొదటి పేజీ తరువాయి)

నోటీసులు ఇవ్వనున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన బాధ్యతలను పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి అప్పగించారు. ఇందుకు అనుగుణంగా.. పురపాలక శాఖ తాజాగా రెవెన్యూ సహా కీలక విభాగాలకు నోట్ పంపింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే.. హెచ్ఎండీఏపరి?ధిలో ఉన్న 3532 చెరువుల ఆక్రమణలపై, వాటి సంరక్షణపై పూర్తి అధికారాలు హైడ్రా పరిధిలోకే రానున్నాయి.

### ఏయే అధికారాలను బదలాయిస్తారంటే..

తెలంగాణ భూ ఆక్రమణ చట్టం, తెలంగాణ వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాలు, జీహెచ్ఎంసీ చట్టాల ద్వారా అమలు చేసే అధికారాలను, పంచాయతీరాజ్ పరిధిలో అమలు చేస్తున్న అధికారాలను హైడ్రా పరిధిలోకి తీసుకు రానున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఇప్పటివరకు నోటీసులు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు ఆధ్వర్యంలో ఇస్తున్నారు. నోటీసులు ఇవ్వడం, ఇచ్చిన నోటీసులను తొలగించే అధికారం కేవలం రెవెన్యూ అధికారులకే ఉంది. మునిసిపాలిటీ పరిధిలోనైతే ఆయా సంస్థలకు ఉంటుంది. వాటన్నింటినీ ఇప్పుడు హైడ్రాకు బదలాయించాలంటే జీవో ద్వారా చేయాలా? లేక చట్టంలో మార్పులు తేవాలా? అనే అంశంపై రెవెన్యూ అధికారులు న్యాయసలహా కోరారు.

అయితే ఓఆర్ఆర్ పరిధిలోనైతే కొన్ని అంశాల్లో చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుందని, మరికొన్ని అంశాలపై జీవో ద్వారా అధికారాలను బదలాయించవచ్చునే చర్చ జరుగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలు, కూల్చివేతలకు సంబంధించి ఉన్న అధికారాలను జీవో ద్వారా బదలాయించే అవకాశం ఉందని, దాని పరిధిలో లేని చోట్ల చట్టపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ విషయంలో ఇప్పటివరకు రెవెన్యూ శాఖ ద్వారా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటోంది.

ఎక్కడైనా, వాల్టా చట్టం ఉల్లంఘనలు జరిగినా, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా.. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు ప్రస్తుతం రెవెన్యూ అధికారులకే ఉంది. భూ ఆక్రమణలకు సబంధించి కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ పరిధిలో భూ ఆక్రమణ చట్టం-1905 ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 5, సెక్షన్ 6 ద్వారా భూ ఆక్రమణకు పాల్పడిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. రెవెన్యూ రికవరీ యాక్ట్-1864 సెక్షన్ 25 ద్వారా రికవరీ నోటీసులు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉన్నారు. అలాగే చెరువులు, కాలువల భూభాగంలో నిర్మించిన ఇళ్లపై చర్యలు తీసుకునేందుకు 2002 వాల్టా చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తారు. ఈ తరహా అధికారాలన్నింటినీ ఇకపై హైడ్రాకు కట్టబెట్టనున్నారు.

### 3532 చెరువులూ హైడ్రా పరిధిలోకే..

హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3532 చెరువులు ఉన్నాయి. వాటిలో అనేక చెరువులు కబ్జాలకు గురయ్యాయి. ఈ చెరువుల్లో ఆక్రమణలన్నింటినీ తొలగించేందుకు అవసరమైన అధికారాలను హైడ్రాకు దఖలు పరచడమే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. మరోవైపు వీటిలో 230 చెరువులకు సంబంధించి మాత్రమే హెచ్ఎండీఏ తుది నోటిఫికేషన్ ఇచ్చింది. మిగిలిన 2525 చెరువులకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ కాగా.. తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. తుది నోటిఫికేషన్ ఇచ్చిన చెరువుల్లోని ఆక్రమణలను తొలగించడం, ప్రాథమిక నోటిఫికేషన్ వచ్చిన వాటిలో ఆక్రమణలపై కూడా దృష్టి పెట్టే దిశగా హైడ్రాను బలోపేతం చేయనున్నారని సమాచారం.

## కాంగ్రెస్‌లోకి రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా

(మొదటి పేజీ తరువాయి)

పునియా కాంగ్రెస్‌లో చేరడం కీలక పరిణామం అని రాహుల్ గాంధీ అన్నారు . అక్టోబర్‌లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల జరుగనున్న క్రమంలో కాంగ్రెస్ బుధవారం కాంగ్రెస్ ఎన్నికల సంఘం సమావేశమయ్యింది. ఈ సమావేవంలో వినేష్ ఫోగట్‌ను కాంగ్రెస్ తరఫున హర్యానాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో దేనికైనా పోటీ చేయడానికి కాంగ్రెస్ ఆఫర్ చేరసింది. చర్కీదాద్రి, బద్దా, జులనా నియోజ కవర్గాల నుంచి దేనికైనా పోటీ చేసేందుకు వినేష్ ఫోగట్ కు ఆఫర్ ఇచ్చారు. చర్కీ దాద్రీ వినేష్ ఫోగట్ సొంత జిల్లా.., ఆమె సొంత గ్రామం బలాలీ.. బద్దాడా అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. ఇక ఆమె అత్తమామల ఇల్లు జులనాలో ఉంది.. దీంతో కాంగ్రెస్ ఈ మూడు నియోజకవర్గాలనుంచి వినేష్ ఫోగట్ కు పోటీ చేయాలని కోరారు. మరోవైపు బజరంగ్ పునియా కూడా కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చింది. బహదూర్ ఘర్ లేదా భివానీ నుంచి రాబోయే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ రెండు స్థానాలు జాట్ ల ప్రాబల్యం ప్రాంతాలు. అయితే బద్లీ , ఝుజ్జర్ లోని సోనిపట్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని బజరంగ్ పునియా చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు బలంగా ఉన్నారు. బద్లీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కులదీప్ వత్స్.. హర్యానా కాంగ్రెస్ ప్రముఖులలో ఒకరు.. దీంతో ఆయన టికెట్ రద్దు చేయడం కాంగ్రెస్ కు ఇష్టం లేదు. సోనిపల్‌లోని ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేంద్ర పర్వాన్ ఓ కేసులో జైలులో ఉన్నారు. ఆ స్థానం నుంచి అతని కుటుంబ సభ్యులలో ఒకరికి టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు బజరంగ్ పునియా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదని తెలుస్తోంది.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు షాక్

(మొదటి పేజీ తరువాయి)

సుఖ్‌విందర్ సింగ్ సుఖు మంగళవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ఈ బిల్లులో ప్రస్తావించారు. 'రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఏ సమయంలోనైనా అనర్హులుగా ఉన్నట్లయితే, చట్టం ప్రకారం ఒక వ్యక్తి పెన్షన్‌కు అర్హులు కాదు' అని ఆ బిల్లులో పేర్కొన్నారు. కాగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన కొత్త బిల్లు ప్రకారం ఇతర పార్టీలకు ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పెన్షన్ నిలిపివేస్తారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు ఇది వర్తిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ రాష్ట్రంలోని ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది.




## ఈ నెల 7,17న సెలవు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం..!

హైదరాబాద్,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): నెలలో..7,17వ తేదీలను సెలవు దినాలుగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఆ వివరాలు ఇలా ఉన్నాయి.మిలాద్ ఉన్ నబీ,గణేష్ చతుర్థి పండుగలకు తెలంగాణ ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.సెప్టెంబర్ 7వ తేదీ గణేష్ చతుర్థి,సెప్టెంబర్ 17న మిలాద్ ఉన్ నబీకి హాలీడే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.అయితే,తెలంగాణ సాధారణ సెలవుల క్యాలెండర్ ప్రకారం..7వ తేదీ గణేష్ చతుర్థి,సెప్టెంబర్ 16న మిలాద్ ఉన్ నబీకి సెలవుగా డిక్లేర్ చేశారు.అయితే నెలవంక దర్శనం తేదీని బట్టి మిలాద్ ఉన్ నబీ హాలీ డే డేట్ మారింది.మొదట నిర్ణయించిన 16న కాకుండా..17వ తేదీని మిలాద్ ఉన్ నబీ హాలీడే గా ప్రభుత్వం తాజాగ డిక్లేర్ చేసింది.ఈ నెల 7వ తేదీన గణేష్ వినాయక చవిత ప్రారంభం కానుండగా..17న నిమజ్జనం జరగనుంది.17న వినాయక నిమజ్జనం జరగనుండటంతో అదే తేదీన జరగాల్సిన మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ర్యాలీ వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.19వ తేదీన మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు ర్యాలీ జరిగే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.

## తేలు కాటుతో యువ రైతు మృతి

గట్టు,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): వ్యవసాయ పొలంలో వ్యవసాయ పనులో నిమగ్నమైన వడ్డే మల్లేష్ (19) అనే యువకుడు బుధవారం తేలుకాటు తో మృత్యువాత పడ్డారు. వివరాలకు వెళితే గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ తన సొంత పొలంలో కుటుంబసభ్యులతో పాటు వరి నాట్లు వేస్తున్నాడు. పొలంలో పని వేస్తుండగా తేలు మలేష్ చేతికి కాటు వేసింది. దీంతో సమీపంలో ఉన్న ఆసుపత్రి కి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గద్వాల పోస్టుమార్టం వద్ద భాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాడసానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటా మాజీ ఎంపిపి విజయ్ తదితరులు ఉన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బి.శ్రీనివాస్



కేటిదొడ్డి,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి.శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ రావును జిల్లా డిసిఆర్బీకి పంపడంతో ఆ స్థానంలో బి.శ్రీనివాస్ ను నియమించారు. ఈ సందర్భంగా కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. గుట్కా, పేకాట, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకి పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(నమస్తే ఉదయం): గణేశ్ చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు బుధవారం కేటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లో పిస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఈ నెలలో వినాయక చవితి పండగ ఉన్నందున ప్రజలు వినాయక చవితి నిర్వాహకులు




పోలీసులు సూచించిన సూచనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దలు తమ తమ కాలనీలలో యువతతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలతోపాటు,, కుల మత పెద్దలు, యువత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శంషాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే ఉదయం): మల్కారం సబ్ స్టేషన్‌లో గల 11KV మల్కారం ఫీడర్ ,11KV నానాజీపూర్ ఫీడర్, 11KV రామాంజపూర్ ఫీడర్ 33KV కొత్త లైన్ స్ట్రింగ్ కోరకు బుధవారం సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.ఉదయం 11.30 గంటల నుండి 15.00 గంటల వరకు రాయన్నగూడ, నానాజీ పూర్, మల్కారం, కవేలిగూడ, రామాంజపూర్, బోటిగూడలలో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.





నూతన మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కురువ హనుమంతు,




మార్కెట్ యార్డ్ నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## ఆఘమేఘాల మీద గద్వాల మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం

**కోర్టును ఆశ్రయించి, ఉత్తర్వులు నిలిపివేస్తారన్నా నెపంతోనే ప్రమాణ స్వీకారం..?**

**అలాంటిది ఏమి లేదు.. ముహుర్తం బాగుంది కాబట్టి ప్రమాణస్వీకారం?**

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(నమస్తే ఉదయం): గద్వాల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో నిర్వహించారు. అధికార పార్టీ కాంగ్రెస్ లో ఓ వర్గం నేతలు ప్రభుత్వం జారీ చేసిన నూతన పాలకవర్గం పై హైకోర్టును ఆశ్రయించడంతో ఎక్కడ హై కోర్టు స్టే ఇస్తుందో అని నెపంతో ఆఘమేఘాల మీద మార్కెట్ యార్డు నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో గద్వాల మార్కెట్ యార్డు నూతన కమిటీ చైర్మన్‌గా కుర్వ హనుమంతు, వైస్ చైర్మన్‌గా గంగిరెడ్డిగారి శ్రీకాంత్ తో సహా పాలక వర్గంలోని మరో 8 మంది డైరెక్టర్లు మార్కెట్ యార్డు కార్యదర్శి పుష్పమ్మ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం రూ.3 కోట్లు పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం నూతనంగా ప్రమాణం చేసిన పాలక మండలి సభ్యులు తీర్మానం చేశారు.

ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి గద్వాల మార్కెట్ యార్డును తెలంగాణలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు.

పాలకమండలి విజయవంతంగా సేవలందించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన పాలకవర్గం చైర్మన్, డైరెక్టర్ లందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

**అఘామేఘాల మీద మార్కెట్ యార్డు పాలక మండలి ప్రమాణం స్వీకారం**

ఎంతో ఉత్కంఠ రేపిన గద్వాల మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆఘమేఘాల మీద కొనసాగింది. అధికార పార్టీ కాంగ్రెస్ లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరితల మద్య గత కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ క్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల తన వర్గీయులకు మార్కెట్ యార్డు పదవులు దక్కించుకున్నారని ఇటీవల విడుదలైన మార్కెట్ యార్డు ఉత్తర్వులే నిదర్శనం. గతంలోనే కాంగ్రెస్ పార్టీ లో ఉన్న మరో వర్గం నేత మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత తమ వర్గానికి గద్వాల మార్కెట్ యార్డు పాలకవర్గం దక్కించేందుకు ప్రయత్నాలు వేసింది. ప్రభుత్వం నుండి ఉత్తర్వులు తెప్పించేందుకు చివరి వరకు ప్రయత్నం చేసి విఫలం చెందారు. ఐతే గద్వాల మార్కెట్ పాలకమండలి కూర్పులో గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ప్రత్యర్థి వర్గం పై పైచేయి సాధించారు. కాగ అయితే మాజీ జెడ్పీ చైర్ పర్సన్ వర్గం నేతలు ప్రభుత్వం నుండి వచ్చిన నూతన పాలక మండలి ఉత్తర్వులు పై హైకోర్టును ఆశ్రయించారు, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తారన్నా సమాచారంతోనే అఘామేఘాలపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల నూతన పాలకమండలితో ప్రమాణ స్వీకారం చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాగ దీనిపై నూతన మార్కెట్ యార్డు నూతన పాలకవర్గాన్ని వివరణ కోరగా అలాంటిది ఏమి లేదని, ఇవ్వాల ముహుర్తం బాగుండడంతో ప్రమాణస్వీకారం చేసినట్లు పేర్కొన్నారు. కాగ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత గతంలోనే మార్కెట్ యార్డు పాలకమండలి పేర్లను ప్రభుత్వానికి ప్రపోజల్ చేశారు. ఉత్తర్వులను బయటకు రాకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తు ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తమకు న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించారని తెలుస్తోంది.

## చిన్నోనిపల్లి బాధితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**నిర్వాసితులతో కలిసి ముంపు గ్రామాన్ని సందర్శించిన జోగులాంబ గద్వాల జిల్లా బిఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు**

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(నమస్తే ఉదయం): చిన్నోనిపల్లి గ్రామంలోకి రిజర్వాయర్ నుండి గ్రామంలోకి వరదనీరు చేరుకుంటుందని భయంతో గ్రామస్థులు బిక్కుబిక్కుమని నివాసాలు ఉంటున్నాట్లు ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకొని గ్రామస్థులతో కలిసి గ్రామాన్ని సందర్శించి, వీధి వీధి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. దీంతో గ్రామస్థులు తమ సమస్యలను చెప్పారు... అనంతరం లిరిజర్వాయర్ ద్వారా మునిగిన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు.... బిఆర్ఎస్ పార్టీ తరుపున నుండి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మీకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ...చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు షిఫ్టింగ్‌కు మూడు నెలలు సమయం ఇవ్వాలని వారు కోరారు... నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న బిల్లు లను అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు....గతంలో 18 సంవత్సరాల లోపు ఉన్న వారికి ప్లాట్లు ఇవ్వలేదని,ఇప్పుడు అలాంటి వారిని గుర్తించి నివాస గృహాల నిర్మాణం కోసం ప్లాట్లు మంజూరు చేయాలని వారు కోరారు.చిన్నోనిపల్లి గ్రామస్థులు పై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు చేపట్టకుండా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ప్రతి ఒకరికి అందేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.చిన్నోనిపల్లి గ్రామస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పంచాయతీ సెక్రటరీ రవీంద్ర గౌడ్ తో మాట్లాడి, మునిగిన



పంట పొలాలకు నష్టపరిహారం పై వివరాలు సేకరించి జిల్లా అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్ పాషా,రాజు నాయుడు, తిమ్మప్ప గౌడ్, రాయపురం వీరేష్,కర్రెప్ప,బాసు బొజ్జయ్య నాయుడు,రామచంద్ర గౌడ్,నరసింహులు గౌడ్,నల్లారెడ్డి, రాజు, మద్దిలేటి, శాంతప్ప, లోకేష్ రాజు, జగదీష్,మరియు చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఉద్యాన వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మర్రి రాజశేఖర్

ములుగు,సెప్టెంబర్4(నమస్తే ఉదయం): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇచ్చే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ములుగు లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ



ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ మర్రి రాజశేఖర్ ఎంపికయ్యారు.

బోధన, పరిశోధనలో సుమారు 26 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కలిగిన డాక్టర్ మర్రి రాజశేఖర్ ఉద్యాన విద్యార్థులకు పీజీ, పీహెచ్డీ కోర్సులలో తోట పంటల్లో ఆధునిక పజ్ఞానంపై బోధిస్తున్నారు. గతంలో 15 సంవత్సరాలు పైగా ఏఐసిఆర్పి ఆన్ ఫ్రూట్స్, మూడు సంవత్సరాలకు పైగా పామ్ ఆయిల్ తోటల పై పరిశోధన చేసిన వారు అనేక టెక్నికల్ బులిటెన్లు, బుక్ చాప్టర్లు, ఉద్యాన పంటలకు సంబంధించిన అంశాలపై వ్యాసాలు రచించారు. ముగ్గురు పిహెచ్ డి విద్యార్థులను, అలాగే 14 మంది పీజీ విద్యార్థులకు పరిశోధనలో మార్గ దర్శకులుగా పనిచేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లలో 60 పైగా పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించారు. గతంలో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు పొందిన డాక్టర్ మర్రి రాజశేఖర్ ఒక పేటెంట్ సైతం కలిగి ఉన్నారు.

ప్రస్తుతం ములుగు ప్రధాన కేంద్రంగా గలిగిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ తో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఇన్చార్జిగా, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలికి వర్సిటీ నుండి నోడల్ ఆఫీసర్ గా సేవలందిస్తున్నారు. డాక్టర్ మర్రి రాజశేఖర్ కి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల తోటి ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలించిన కౌన్సిలర్

గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4(నమస్తే ఉదయం): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలుతున్నాయి. గద్వాల మున్సిపాలిటీలోని 10వ వార్డులోని వాటర్ ట్యాంక్ సమీపంలో పద్మమ్మకు చెందిన ఇంటి మొదటి గది పైకప్పు కూలింది. అదే విధంగా రహ్మతులా ఇంటి పైకప్పు కూలింది. కాగా పాత ఇల్లు కావడంతో ప్రమాదకరంగా ఉండడం, ఆ గదిలో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. అదే విధంగా చాకలి వీధిలో మరో రెండు ఇండ్లు పై కప్పు కూలిపోయాయి. ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో తమ ఇళ్లు కూలిపోతాయన్న భయంతో కొందరు ఇంటి యజమానులు ఉన్నారు.



విషయం తెలుసుకున్న పదవ వార్డు కౌన్సిలర్ అలియాబేగం షకూర్ వర్షం కారణంగా కూలిన ఇండ్లను పరిశీలించారు. ఇల్లు కూలి నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకునేలా కృషి చేస్తమన్నారు.




## వరద బాధితులకు సాయంగా టాలీవుడ్

దేశంలో ఎప్పుడు, ఎలాంటి కష్టం వచ్చినా టాలీవుడ్ పరిశ్రమ కూడా తనవంతుగా సాయం అందిస్తోంది. గత నెలలో కేరళ వాయనాడ్ వరదల నేపథ్యంలో మొదటగా స్పందించి సాయం అందించింది టాలీవుడ్ మాత్రమే. ఇప్పుడు మన రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు టాలీవుడ్ సెలబ్రిటీలు చాలామంది ముందుకొచ్చి విరాళాలు ప్రకటిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేష్ బాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ, విశ్వక్ సేన్, సిద్దు జొన్నలగడ్డ, కథానాయిక అనన్య నాగళ్ల, యాంకర్ స్రవంతి, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, వంశీ, ఆయ్ మూవీ టీం తమవంతు సాయంగా ప్రకటించగా తాజాగా మెగాస్టార్ చిరంజీవి రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు రూ. కోటి విరాళం ప్రకటించారు. గత నెలలో వయనాడ్ వరదల నేపథ్యంలోనూ చిరంజీవి ఆ రాష్ట్ర సీఎం సహాయ నిధికి రూ. కోటి ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు నన్ను కలిచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో అమాయక ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశరలో రెండు ప్రభుత్వాలు శాయాశక్తులా పరిస్థితిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాల్లో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు సీఎంల రిలీఫ్ ఫండ్‌కు చెరో 50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాను. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అంటూ తన సానుభూతిని తెలియజేశారు.

## దేవర నుంచి కొత్త పోస్టర్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్



పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తుంది చిత్రబృందం. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్‌తో పాటు సెకండ్ సింగిల్ చుట్టమల్లే పాటలను విడుదల చేయగా.. ఈ రెండు పాటలు యూట్యూబ్‌లో దూసుకుపోతున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి థర్డ్ సింగిల్ 'దావుడి' సాంగ్‌ను ఈరోజు సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.



## ఎంటర్‌టైనింగ్‌గా 'విశ్వం'

**- హీరో గోపీచంద్**

గోపీచంద్, శ్రీను వైట్ల, టీజీ విశ్వ ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ 'విశ్వం' హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్ విడుదల, అక్టోబర్ 11న థియేట్రికల్ రిలీజ్ డైరెక్టర్ శ్రీను వైట్ల కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లను డీల్ చేయడంలో ఎక్స్ పర్ట్. ముఖ్యంగా కామెడీని హ్యాండిల్ చేయడంలో దిట్ట. మాచో హీరో గోపీచంద్ తో శ్రీను వైట్ల రూపొందిస్తున్న స్టైలిష్ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వం'. ప్రమోషన్స్‌ను కిక్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. టీజర్ నరేష్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైయింది. గోపీచంద్, కావ్యా థాపర్ పాత్రల పరిచయం, వారి క్యారెక్టర్స్ లో కామెడీ స్పార్క్ ఆకట్టుకున్నాయి. టీజర్ లో ప్రముఖ నటీనటులతో కామెడిక్ సీన్స్ హిలేరియస్ గా వున్నాయి, టీజర్ చివరి భాగంలో యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ అదిరిపోయాయి. హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. విశ్వ ప్రసాద్ గారికి థాంక్ యూ. ఆయన లేకపోతే ఈ సినిమా ఇంత స్మూత్ గా అయ్యేది కాదు. శ్రీనువైట్ల గారితో సినిమా చేయాలని చాలా ఇయర్స్ నుంచి అనుకుంటున్నాను. వన్ ఇయర్ బ్యాక్ ఆయన్ని ఓ పార్టీలో కలవడం, సినిమా చేద్దామని అనుకోవడం, అక్కడి నుంచి మా జర్నీ స్టార్ట్ అయ్యింది.

నేను చాలా మంది డైరెక్టర్స్‌తో వర్క్ చేశాను. శ్రీను వైట్ల గారు కంఫర్ట్ బుల్, హీరో డైరెక్టర్. హీరోని ఎలా చూపించాలనే కంప్లీట్ క్లారిటీ వున్న డైరెక్టర్. ఈ జర్నీ చాల ఎంజాయ్ చేశాను. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని వుంది. సినిమా చాలా బావొచ్చింది. ఒక మంచి ఎంటర్ టైనర్ చేయాలని అనుకున్నాను. ఈ సినిమా డెఫినెట్ గా మంచి హిట్ అవుతుందనే నమ్మకం వుంది' అన్నారు.

## దర్శకుడు హరీశ్ శంకర్ పెద్ద మనసు

### మిస్టర్ బచ్చన్ ఫెయిల్యూర్‌తో 2కోట్లు వాపస్

మాస్ మహారాజ రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వచ్చిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. షాక్, మిరపకాయ్ వంటి సూపర్ హిట్ సినిమాల తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా రావడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ అంచనాలను అందుకోలేక పోయింది ఈ చిత్రం. ఇండిపెండెన్స్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాగా.. ఫస్ట్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అందుకోవడమే కాకుండా.. సోషల్ మీడియాలో



విపరీతంగా ట్రోల్ అయ్యింది ఈ చిత్రం. అయితే ఈ సినిమాకు వచ్చిన నష్టాల వలన దర్శకుడు హరీశ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలస్తుంది. ఈ మూవీ వలన నష్టపోయిన నిర్మాతకు హరీశ్ శంకర్ తన రెమ్యూనరేషన్ నుంచి రూ.2 కోట్లు వెనక్కి ఇచ్చినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు హరీశ్ శంకర్ దర్శకుడిగా రూ.10 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. ఇందులో నుంచే నిర్మాతకు రూ.2 కోట్లు తిరిగి ఇచ్చినట్లు టాక్. అయితే హరీశ్ శంకర్ చేసిన పనికి రవితేజ అభిమానులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## అక్టోబర్ 4న 'శ్వాగ్'

కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు వైవిధ్యమైన పాత్రలతో అదరగొడుతున్నారు. ఎంటర్టైన్మెంట్ తో ఆకట్టుకునే సబ్జెక్ట్‌లను బ్యాలెన్స్ చేయడంలో పేరుపొందిన శ్రీ విష్ణు సూపర్ హిట్ 'రాజ రాజ చోరా' తర్వాత డైరెక్టర్ హసిత్ గోలీతో తన సెకెండ్ కొలాబరేషన్‌గా 'శ్వాగ్' తో అలరించబోతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా, మేకర్స్ మూవీ రిలీజ్ డేట్ అప్‌డేట్‌తో వచ్చారు. దసరాకి దాదాపు 10 రోజుల ముందుగా అక్టోబర్ 4న 'శ్వాగ్' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ అవుతుంది. పండుగ సెలవులు సినిమాకు ఫేవర్ గా ఉండబోతున్నాయి. సినిమా విడుదలకు దాదాపు నెల రోజుల సమయం ఉంది. రెగ్యులర్ అప్‌డేట్‌లతో రావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'శ్వాగ్' పాజిటివ్ రిపోర్ట్స్ తో దూసుకుపోతోంది. పోస్టర్లు, ఫస్ట్ సాంగ్ , రేజర్ వీడియో, టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. యూనిక్ కంటెంట్ ప్రేక్షకులని ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరో నటిస్తుండగా, మీరా జాస్మిన్, సునీల్, దక్షనాగార్కర్, శరణ్య ప్రదీప్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వేదరామన్ శంకరన్ సినిమాటోగ్రాఫర్ కాగా, వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. జీఎం శేఖర్ ఆర్ట్ డైరెక్టర్ కాగ, నందు మాస్టర్ స్టంట్స్ నిర్వహిస్తున్నారు.



## జనక అయితే గనక విడుదల వాయిదా

దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోన్న సినిమా'జనక అయితే గనక' విడుదల వాయిదా పడింది.. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. అంబాజీపేట మ్యారేజ్ బ్యూరో, ప్రసన్నవదనం వంటి వరుస హిట్ చిత్రాల తర్వాత సుహాస్ హీరోగా నటించగా సంకీర్తన కథానాయికగా చేసింది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించారు. ఇటీవల విడుదల చేసిన సినిమా ట్రైలర్ మంచి ఆదరణను కూడా దక్కించుకుంది. అయితే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. ఈక్రమంలో సెప్టెంబర్ 7న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు విడుదల తేదీని కూడా ప్రకటించి ప్రమోషన్ కార్యక్రమాలు సైతం ప్రారంభించారు. ఇదిలావుండగా ఏపీ, తెంగాణ రాష్ట్రాల్లో తుఫాన్ వల్ల వరద భీభత్సం జరగడం, చాలామంది చనిపోవడం, ఇండ్లు మునగడం, తదితర సమస్యలు తలెత్తాయి.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733